సాక్షి పల్నాడు

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

అమరావతి: అమరేశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నం జిల్లా భీమిలి వాస్తవ్యులు దాట్ల సూర్య అప్పలరాజు రూ.1,00,116 విరాళం ఆదివారం అందజేశారు.



ఘనంగా అయ్యప్ప పూజ

బాపట్ల : జీమావారిపాలెం ఆదివారం రాత్రి అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. కొటికం సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ధరమ్ స్వరూప్ నకరాకు నివాళి



గుంటూరువెస్ట్: జాతీయ పెన్షనర్స్ డేను పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో ధరమ్ స్వరూప్ నకరా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఏపీ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన' రద్దు

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

పల్నాటి తిరునాళ్ల



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందడి ఆదివారం కూడా కొనసాగింది. మండల ప్రజలతోపాటు పల్నాడులోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వీరుల గుడి ఉత్సవ ప్రాంగణానికి తరలివచ్చారు. వివిధ రకాల స్టాళ్లను సందర్శించి ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేశారు. పిల్లలు ఆట వస్తువులు కొన్నారు. రంగులరాట్నాలు, జెయింట్ వీల్స్ ఎక్కి కేరింతలు కొట్టారు. ప్రజలు వీరుల గుడిలోని ఆయుధాలను దర్శించుకుని పూజలు చేశారు. అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. ప్రధాన ఘట్టాలు శనివారంతోనే ముగిసినా జన రద్దీతో కారెంపూడి ఆదివారం తిరునాళ్లను తలపించింది.

గ్రూప్-1, 2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

బాపట్ల అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్ -1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీకి చెందిన అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ - సాధికారత అధికారి బి.అర్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-2కు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 60 మంది అభ్యర్థులకు ఈనెల 27 నుంచి 50 రోజులపాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. గ్రూప్-1 (ఉమ్మడి గుంటూరు జిల్లా వారికీ మాత్రమే) అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 60 మంది అభ్యర్థులకు జనవరి 5వ తేదీ నుంచి 60 రోజులపాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక విధానం, డిగ్రీలో వచ్చిన మార్కులు, మెరిట్ ప్రాతిపదికపై ఎంపిక చేస్తామని తెలిపారు.

సుబ్బారాయుడి కల్యాణోత్సవాలు ప్రారంభం



మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి షష్ఠి కల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివార్లను పెళ్లి కుమారునిగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణ, అంకురారోపణ, వాస్తుపూజ, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

నరసరావుపేట రూరల్: దేవదాయ ధర్మదాయ శాఖ, త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 24 వరకు ధర్మప్రచార వారోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి దేవస్థానం, 19న నరసరావుపేట పాతూరులోని గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి దేవస్థానం, 20న ఇస్సపాలెంలోని మహంకాళి దేవస్థానం, 21న జొన్నలగడ్డలోని వేణుగోపాలస్వామి దేవస్థానం, 22న ఉప్పలపాడు గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానం, 23న పెట్లూరివారిపాలెంలోని బొడ్డురాయివద్ద, 24న కోటప్పకొండలోని సిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా ఆలయాల వద్ద జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కనుల పండగ

నయనానందం



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు ముచ్చి నాగమణి. వయస్సు 61 ఏళ్లు. ఊరు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం. వయస్సుపైబడడంతో చూపు మందగించింది. గుంటూరు నల్లచెరువులోని కొడుకు వద్దకు వచ్చి ఉంటుంది. అతను ఆటో డ్రైవర్. ఇటీవల నాగమణి జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరంలో చూపించుకుంది. వైద్యులు శుక్లాలు ఉన్నాయని, ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. గుంటూరు జీజీహెచ్‌లో గతనెల 18న అడ్మిట్ చేసుకుని క్యాటరాక్ట్ సర్జరీ ఉచితంగా చేశారు. 20న డిశ్చార్జి చేసి ఇంటికి పంపే సమయంలో రూ.1,570 వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా అందజేశారు. ఏడాది క్రితం భీమవరంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఎడమ కన్నుకు ఆపరేషన్ చేయించామని, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కుడి కన్నుకు శస్త్రచికిత్స చేశారని, ఇప్పుడు బాగా చూడగలుగుతున్నానని నాగమణి ఆనందం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

- నేత్ర వైద్యానికి భరోసా
- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి స్క్రీనింగ్ టెస్టులు
- దృష్టి సమస్యల గుర్తింపు
- ఉచితంగా శస్త్రచికిత్సలు
- కళ్లజోళ్లు పంపిణీ



కంటిపాపల్లె కాపాడే సర్కారు : వైద్య శిబిరాల్లో కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు (ఫైల్)

గుంటూరు మెడికల్: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. శరీరంలో కన్ను అత్యంత ప్రధానమైంది. అందమైన ప్రపంచాన్ని చూడాలంటే నేత్రాలు బాగుండాలి. నేత్ర సమస్య తలెత్తిందంటే జీవితం దుర్భరమై పోతుంది. మన పని మనం చేసుకోలేక ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. వృద్ధాప్యంలో ఎక్కువ మంది కంటి చూపు సమస్యతోనే ఇబ్బంది పడుతుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో కంటి సమస్యలతోనే జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. కొందరు స్కూల్ పిల్లలూ నేత్ర సమస్యలతో సతమతమవుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం కంటి వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన వెంటనే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ప్రవేశపెట్టి వృద్ధులకు పరీక్షలు చేయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకూ పరీక్షలు చేయించింది. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించడంతోపాటు కళ్లజోళ్లూ ఉచితంగా అందించింది. అలాగే ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కూడా కంటి వైద్యానికి పెద్దపీట వేసింది. కంటి స్క్రీనింగ్ పరీక్షలు ప్రత్యేకంగా చేపడుతోంది. ముఖ్యంగా ఆదరణకు నోచుకోని వృద్ధుల కంటి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించింది. రూ.50 వేలు ఖరీదు చేసే ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తోంది. కళ్లజోళ్ల పంపిణీకి చర్యలు చేపట్టింది. మందులూ అందిస్తోంది. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇప్పటివరకు 436 ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. 1,78,910 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 45,771 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 2,700 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించారు. జిల్లాలోని 14 ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రులను గుర్తించి రోగులను రిఫర్ చేశారు. ఇప్పటివరకు 1,190 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేశారు.

జిల్లాలో ఇప్పటివరకు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ	: 436
స్క్రీనింగ్ పరీక్షలు	: 1,78,910
కళ్లజోళ్లు అవసరమైన రోగులు	: 45,771
కంటి ఆపరేషన్లకు రిఫర్ చేసిన వారు	: 2,700
దిగ్విజయంగా పూర్తిచేసిన శస్త్రచికిత్సలు	: 1,190

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా ఉంటున్నాను. 42 ఏళ్లు. పెళ్లి కాలేదు. ఇటీవల నాకు కంటి చూపు సమస్య తలెత్తింది. వలంటీర్ సాయంతో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో చూపించుకున్నా. వైద్యులు పరీక్షలు చేసి ఆపరేషన్ చేయాలన్నారు. వెంటనే గతనెల 23న జీజీహెచ్‌లో అడ్మిట్ చేసుకుని 24న ఉచితంగా క్యాటరాక్ట్ ఆపరేషన్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ముసలయ్య, కాకుమాను, గుంటూరు జిల్లా

23 నుంచి కళ్లజోళ్లు పంపిణీ



ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈనెల 23 నుంచి కళ్లజోళ్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశాం. జిల్లాకు వచ్చిన కళ్లజోళ్లను పరిశీలించి వాటిలో అద్దాల పవర్‌ను నిర్ధారించి స్క్రీనింగ్ పరీక్షల్లో కళ్లద్దాలు అవసరమని గుర్తించిన వారికి అందజేస్తాం. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా కళ్లజోళ్ల పంపిణీ జరుగుతుంది.

– డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, కంటివెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్

దుర్గగుడిలో భక్తుల కోలాహలం

ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్

విజయవాడ: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. ఆది దంపతులకు ఆదివారం నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంతో పాటు ఇతర పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ. 500 వీఐపీ టికెట్లను కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మకు మహా నివేదన నిమిత్తం అరగంటపాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం దర్శనాలు ప్రారంభమయ్యాయి. సర్వదర్శనానికి రెండు గంటలు, టికెట్ల దర్శనాలకు గంట సమయం పట్టింది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు భక్తుల రద్దీ కనిపించింది.



ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో తీసిన పెలికాన్ పక్షుల చిత్రం

ఛాయాచిత్ర 'కిరణం'

ఫొటోగ్రఫీలో బుడతడి ప్రతిభ

- 11 ఏళ్ల వయసులోనే అద్భుతాల ఆవిష్కరణ
- రాణిస్తున్న గుంటూరు విద్యార్థి హర్షిల్ కిరణ్
- జాతీయస్థాయితోపాటు పలు పురస్కారాలు కైవసం



పెదనాన్న వరప్రసాద్‌తో కలిసి పల్నాడు కలెక్టర్ శివశంకర్ నుంచి సత్కారం అందుకుంటున్న వీర్నపు హర్షిల్ కిరణ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒక చక్కటి ఛాయాచిత్రం వంద ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. ఒక గాథను కళ్లకు కట్టినట్లుగా చూపుతుంది. అక్షరాలు రాయలేని ఎన్నో వందల పదాలను ఒకే ఒక్క ఫొటో అర్థవంతంగా ఆవిష్కరిస్తోంది. అలాంటి ఛాయాచిత్రాలను కెమెరాలో బంధించాలంటే అనుభవం, అభిలాష, అవకాశాలు ఉండాలి. 11ఏళ్ల వయసులోనే వీటన్నింటినీ ఒడిసిపట్టి అందరినీ అబ్బురపరుస్తున్నాడు గుంటూరుకు చెందిన ఏడో తరగతి విద్యార్థి వీర్నపు హర్షిల్ కిరణ్. పక్షులు, వన్యప్రాణుల ఛాయాచిత్రాలను అందంగా కెమెరాలో బంధించి అందరిచేత ఔరా అనిపిస్తున్నాడు.

ఇదీ కుటుంబ నేపథ్యం

గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డు ఆలా ఆస్పత్రి సమీపంలో నివసిస్తున్న హర్షిల్ కిరణ్ ఓ ప్రైవేటు స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. దాదాపు నాలుగేళ్లుగా వైల్డ్ లైఫ్, బర్డ్స్ ఫొటోగ్రఫీని హాబీగా మలుచుకున్నాడు. ఇప్పటి వరకు వందలాది ఛాయాచిత్రాలను తీశాడు. తాను తీసిన ఫొటోలకు అనేక అవార్డులు, సర్టిఫికెట్లను పొందాడు. విద్యార్థి తండ్రి కిరణ్‌కుమార్ నెల్లూరులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2020 లాక్‌డౌన్ సమయంలో తండ్రితో కలిసి పక్షుల ఫొటోగ్రఫీని అలవాటు చేసుకున్న హర్షిల్ కిరణ్ ప్రస్తుతం తండ్రిని మించిన తనయుడిగా ఎదిగాడు. అద్భుతమైన ఛాయాచిత్రాలను తీస్తున్నాడు. దాదాపు 150 వరకు పక్షులను గుర్తించి, వాటి పేర్లను చెప్పగలడు. సెలవు రోజులు, ఆదివారాల్లో తండ్రి కిరణ్‌కుమార్‌తో కలిసి తిరుపతిలోని ఎస్వీ జూ పార్క్, ఏఎన్‌యూ, నెల్లూరు జిల్లా పులికాట్ సరస్సుతోపాటు కర్నూలు ప్రాంతాల్లో పర్యటిస్తూ అందమైన ఫొటోలను తీస్తున్నాడు. వాటిని వివిధ పోటీలకు పంపుతూ పురస్కారాలూ అందుకుంటున్నాడు.

ఎగ్జిబిషన్లు నిర్వహించాలనే కోరిక

తండ్రి స్ఫూర్తితో పర్యావరణంపై మక్కువ పెంచుకుని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీని హాబీగా ఎంచుకున్నట్లు కిరణ్ చెబుతున్నారు. మనదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ పక్షులు, వన్యప్రాణుల ఛాయాచిత్రాలను తీసి వాటితో పాఠశాలల విద్యార్థులతో ఎగ్జిబిషన్లు నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నాడు. 2023 ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో ఫొటోగ్రఫీలో నేషనల్ అవార్డు అందుకున్న పెదనాన్న నిరంజన్ వరప్రసాద్‌తో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించినందుకు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ హర్షిల్‌ను సత్కరించారు.

కిరణ్ విజయాలు

- గుంటూరు జిల్లా ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రంలో తీసిన ల్యాండింగ్ పెలికాన్ ఛాయాచిత్రాలతో జాతీయస్థాయిలో 180 మంది సీనియర్లతో పోటీపడ్డాడు.
- అత్యుత్తమ ఫొటోగ్రఫీ విభాగంలో కోల్‌కతాకు చెందిన పోర్టియస్ సర్క్యూట్ నుంచి ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ అమెరికా బంగారు పతకం
- ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ నుంచి కాంస్య పతకం
- కోల్‌కత్తాలోని పెంటాగ్రామ్ నుంచి రైజింగ్ స్టార్ ఫొటోగ్రఫీ అవార్డు

ధనాధాన్

పెరిగిన ధర

- డెల్టాలో ముమ్మరంగా వరి నూర్పిళ్లు
- తుఫాన్ ప్రభావంతో ఎకరాకు 4 నుంచి 10 బస్తాల తగ్గుదల
- కల్లాల్లోనే అదనపు ధరకు కొనుగోళ్లతో ఊరట
- 75 కిలోల బస్తా రూ.1,900–2,000 మధ్య పలుకుతున్న వైనం



వరించిన సిరులు : బస్తాల్లోకి వరిధాన్యం ఎత్తుతున్న రైతులు

తెనాలి: మిచాంగ్ తుఫాన్‌కు మాగాణి చేలల్లో నేలవాలిన వరి పైరు ఊపిరి పోసుకుంది. ప్రస్తుతం రైతుల చేతికొస్తోంది. ఫలితంగా కృష్ణా పశ్చిమడెల్టాలో వరి నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తుఫాన్ ధాటికి కకావికలమైన పైరు ఏమవుతుందో.. ఎంత దిగుబడి వస్తుందో.. వచ్చిన ధాన్యం నాణ్యత, ధరలపై మదనపడిన అన్నదాతలకు ప్రస్తుతం మార్కెట్ కొనుగోళ్లు ఊరటనిస్తున్నాయి. దిగుబడి కొంత తగ్గినా మార్కెట్ రేటు తుఫాన్ ముందుకన్నా మరింతగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా బస్తా రూ.1,900–2,000లకు వ్యాపారులు కల్లాల్లోనే కొనుగోలు చేయటం విశేషం.

విరగపండిన వరి

ఖరీఫ్ సీజన్‌లో గుంటూరు జిల్లాలో మాగాణి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు. ఇందులో 1,36,971 ఎకరాల్లో వరి సాగైంది. మాగాణి చేలల్లో వరిపైరు విరగపండింది. వరి కంకులు పసిడి వర్ణంతో మెరిసిపోయాయి. వాటిని చూసి రైతుల మోములు మురిశాయి. ఈ సీజన్‌కు లాభాల పంట పండుతుందని భరోసా కలిగింది. ముందుగా పంటకోతకొచ్చే తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో 44,200 ఎకరాలు సాగుకాగా, డిసెంబరు మొదటి వారానికి 11 వేల ఎకరాల్లో పైరు నూర్పిడి జరిగింది. ఎకరాకు 35–40 బస్తాల దిగుబడి రావడం, వ్యాపారులు నేరుగా చేను వద్దకే వచ్చి 75 కిలోల బస్తా రూ.1,650–1,700లకు కొనుగోలు చేయసాగారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు డొంకరోడ్లు, పొలం సమీపాన ఖాళీస్థలాల్లో ఆరబెట్టుకుని అక్కడికక్కడే విక్రయించసాగారు.

ప్రభుత్వం అప్రమత్తంతో తప్పిన నష్టం

ఆ సమయంలో మిచాంగ్ తుఫాన్ విరుచుకుపడడంతో ఈనెల ఆరు, ఏడు తేదీల్లో కురిసిన వర్షాలు, తోడైన ఈదురు గాలులు జిల్లాలోని అన్నదాతల ఆశలను నీరుగార్చాయి. నేలవాలి, నీటిలో తేలియాడుతున్న వరి పైరును చూసి కర్షకులు డీలాపడ్డారు. అప్రమత్తంగా ఉన్న ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. పంటపొలాలను సందర్శించి, రైతులను కలిసి ధైర్యం చెప్పారు. చేలల్లో నిలిచిన వర్షపునీరు సత్వరం బయటకు వెళ్లేందుకు తగిన కార్యాచరణ చేపట్టారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన డ్రెయిన్లు, పంటకాల్వల్లో తూటు, గుర్రపుడెక్క తొలగించారు. మరోవైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులను ఆదుకుంటామని, అధైర్యపడొద్దని చెప్పారు. రెండో పంటకు 80 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ, సంక్రాంతి కల్లా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని భరోసా ఇచ్చారు. తడిచిన ధాన్యాన్ని కూడా ఎలాంటి షరతులూ లేకుండా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల పదో తేదీ నుంచి వ్యవసాయ సిబ్బంది పంట నష్టం నమోదు ప్రారంభించారు.

పెరిగిన ధరతో విరబూసిన ఆనందాలు

పంటచేలల్లో వర్షపునీరు త్వరితగతిన వెళ్లిపోవటంతో నేలపొడిబారింది. రైతులు నేలవాలిన పైరు నూర్పిళ్లకు ఉపక్రమించారు. పంటపొలాల్లో నూర్పిడి యంత్ర పరికరాలు ముమ్మరంగా పనిచేస్తున్నాయి. ధాన్యం ధరలు ఏమాత్రం తగ్గకపోగా తుఫాన్‌కు ముందుకన్నా మరింతగా పెరిగాయి. ప్రస్తుతం 75 కిలోల ధాన్యం బస్తా ధర రూ.1,900–2,000లకు వ్యాపారులు కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. నూర్పిడి ధాన్యాన్ని అక్కడే ఆరబెట్టుకుని, మట్టిబెడ్డలుంటే జల్లెడపట్టి మరీ అన్నదాతలు అక్కడికక్కడే అమ్మేస్తున్నారు. నాలుగు రోజులుగా తెనాలి ప్రాంతంలోని పంటపొలాల్లో వరి నూర్పిడుల జోరు కనిపిస్తోంది. పైరు నేలవాలిన చేలల్లో 4 నుంచి 10 బస్తాల దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. తుఫాన్‌కు ముందుకన్నా ధాన్యం ధరలో రూ.200పైగా పెరుగుదల కనిపిస్తుండటం ఊరటనిస్తోందని రైతులు చెబుతున్నారు.

ఇంత ధర ఎన్నడూ చూడలేదు



నేను కౌలురైతును. ఇరవై ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఈసారి నాలుగెకరాల్లో వరి వేశాను. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించాను. తుఫాన్‌కు పైరు నేలవాలింది. ఇప్పుడు నూర్పిడి చేస్తున్నాను. 30 బస్తాలు వస్తున్నాయి. బస్తాకు రూ.1,900 పైమాటే. ధాన్యానికి కల్లాల్లో ఇంత ధర రావటం ఎన్నడూ చూడలేదు.

– దాది శ్రీనివాసరావు, కౌలురైతు, తూములూరు శివారు యాదవపాలెం

కొలువుదీరిన తిరుపతమ్మ ఆలయ పాలకవర్గం

చైర్మన్‌గా జంగాల శ్రీనివాసరావు



నూతన పాకవర్గంతో ఈవో రమేష్‌నాయుడు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): స్థానిక తిరుపతమ్మవారి ఆలయ నూతన చైర్మన్‌గా జంగాల శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ మండపంలో ఆదివారం ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు సమక్షంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ చైర్మన్‌తో పాటు సభ్యులుగా కాకాని అలేఖ్య, పాలాది వెంకటరమణ, బెజవాడ శ్రీనివాసరావు, గద్దాటి మహాలక్ష్మి, చీకటిమళ్ల వెంకటరమణ, బోశెట్టి విజయలక్ష్మి, చందాల తిరుపతమ్మ, వీర్ల రమణ, కొలిపాక రాము, మర్రిబోయిన దుర్గారావు, పందింటి కోటేశ్వరరావు, చిన్నవెంకట నాగ దుర్గారావు, బాణావత్ చిన్ని, దేవరకొండ పద్మల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా చైర్మన్‌గా శ్రీనివాసరావును సభ్యురాలు అలేఖ్య ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం ఆలయ అధికారులతో పాటు పలువురు నూతన పాలకవర్గానికి శాలువలతో అభినందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

104 ఎంప్లాయీస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నరసరావుపేట: ఏపీ 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా పి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.కృష్ణవాసులు ఎన్నికయ్యారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి అధ్యక్షతన ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.కోటిరెడ్డి, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, షేక్ బాషా, కోశాధికారిగా సీహెచ్.అశోక్, సహాయ కార్యదర్శిగా వెంకటనరసింహారావుతోపాటు మరో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ 104 వాహనాల ఉద్యోగులు చాలీచాలనీ జీతాలతో విధి నిర్వహణ చేస్తున్నారని, అరబిందో సంస్థ జీతాలు మూడు నాలుగు నెలలకు ఒకసారి చెల్లిస్తోందన్నారు. అందువలన జీతాలు పెంచి, ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

22న రాధాకృష్ణుల కల్యాణం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీ హనుమత్ గీతామందిరంలో రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని 22వ తేదీ వైభవంగా నిర్వహించనున్నట్లు మందిర ధర్మకర్త వి.చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావనం ఆదిత్య నరసింహమూర్తి ఆధ్వర్యంలో రాధాకృష్ణులను పెండ్లి కుమారుని చేయటం, ఎదురుకోల మహోత్సవం, రాధాకృష్ణుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వివరించారు. 23వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, స్థానిక ఆర్యవైశ్య మహిళా మండలి సమష్టి గీతాపారాయణం, 24వ తేదీన వసంత సేవ, అదే రోజు రాత్రి దీపోత్సవం, పవళింపు సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏఎస్ఐ రాజ్‌కుమార్‌కు అవార్డు

చుండూరు(వేమూరు): చుండూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న రాజ్‌కుమార్, డీజీపీ నుంచి అవార్డు అందుకున్నారు. శనివారం మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి బ్రాంజ్ మెడల్ ప్రదానం తీసకున్నారు. కేసుల ఛేదనలో కీలకంగా పనిచేయడంతో అవార్డు దక్కించుకున్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌గా ఎన్టీఆర్ జిల్లా జట్టు

ట్రోఫీ ప్రదానం చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఓవరాల్ చాంపియన్ ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ట్రోఫీ అందిజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో ఓవరాల్ చాంపియన్‌గా ఎన్టీఆర్ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. రన్నర్‌గా చిత్తూరు జిల్లా జట్టు నిలిచింది. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఈతపై ప్రతి ఒక్కరికి అవగాహన, ప్రవేశం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈత ఉత్తమమైన వ్యాయామమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈత పోటీలను సమర్థంగా నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారటీ అధికారి సురేష్, అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పోటీలలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు సాధించగా, ఓవరాల్ రన్నరప్‌గా చిత్తూరు జిల్లా నిలిచింది.

అలరించిన అన్నమయ్య సంకీర్తనల గానం


గానం చేస్తున్న డాక్టర్ కె.పురుషోత్తమరావు

తెనాలి: దాక్షిణాత్య భాషల్లో ప్రథమ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. తెలుగులో పదకవిత రచనకు శ్రీకారం చుట్టి, తెలుగుజాతికి ఇచ్చిన వాంఙ్మయ సంపద అపారం. వేంకటేశ్వర స్వామి సేవలో తరించిన అన్నమయ్య సంకీర్తనలు వివిధ కైంకర్యాలలో, ఉత్సవాల్లో గానం చేయటం, ఆబాలగోపాలం ఈ సంకీర్తనా మాధుర్యాన్ని ఆస్వాదించటం తెలిసిందే. కేవలం భక్తి జ్ఞాన వైరాగ్య భావభరితంగా మాత్రమే కాకుండా అంతర్లీనంగా సామాజిక స్పృహ, సర్వమానవ సమానత్వ సందేశం ప్రసరిస్తూ ఉంటుంది. అందుకే అన్నమయ్య సంకీర్తనలకు తరాలుగా ఆదరణ కొనసాగుతూనే ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న తెనాలికి చెందిన సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం రోజైన ఆదివారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'అన్నమయ్య శ్రీవెంకటేస్వరం' పేరుతో సంగీత కచేరీ నిర్వహించింది. డాక్టర్ కె.పురుషోత్తమరావు, దివ్యశ్రీ మాధురీ లక్ష్మణ్, సుచరిత, దేవీలలిత, శ్వేతస్వి, కృష్ణ శ్రీలత, శ్రీకాంతి, ప్రాజ్ఞేశ్వర లక్ష్మి, రత్నప్రియాంక, జి.ఆంజనేయ శాస్త్రిలు అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా ఆలపించారు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడిపైనే కాకుండా నృసింహుడిపైనా కీర్తనలు రచించారు. ఈ పర్యాయం నృసింహుడు కాన్సెప్ట్‌తో సాగిన కచేరీలో 'పాల నేత్రానల ప్రబల విద్యుల్లతా కేళీ విహార లక్ష్మీనారసింహా' అంటూ డాక్టర్ కె.పురుషోత్తమరావు క్లిష్టతరమైన కీర్తనను, 'లాలిపాట'ను శ్రావ్యంగా ఆలపించి సభికులను రంజింపజేశారు. అన్నమయ్య శృంగార కీర్తనల్లో ఒకటిగా భక్తిని, రక్తిని, ముక్తిని ఏకకాలంలో నడిపిన 'మూసిన ముత్యాలకే లే మెరుగులు' అన్న కీర్తనను మాధురీ లక్ష్మణ్, ఎక్కడైనా హరి ఉంటాడని చెప్పే 'భావములోన బాహ్యములందు గోవిందుడే' అంటూ దివ్యశ్రీ అద్భుతంగా ఆలపించారు. చెలుల నుద్దేశించి యశోద పాడే కృష్ణకీర్తన ' పిలువరే కృష్ణుని'ను శ్రీకాంతి ఆలపించారు. 'కొలువై ఉన్నాడు వీడే గోవిందరాజు' అన్న కీర్తనను ఆంజనేయశాస్త్రి శ్రావ్యంగా గానం చేశారు. 'చిత్తజగురుడా'ను కృష్ణశ్రీలత పాడారు. చివరగా డాక్టర్ పురుషోత్తమరావు 'షోడశ కళానిధికి షోడచోపచారములు' కీర్తన ఆలపిస్తుండగా, వేదికపై ఉంచిన శ్రీవారి విగ్రహానికి అర్చకులు సేవచేసి, హారతినివ్వటం ప్రత్యేక ఆకర్షణ. ఆయా కీర్తనలకు డాక్టర్ పువ్వాడ సోమశేఖర్ చేసిన వ్యాఖ్యానంతో వాటి సారాంశం సభికులకు తేలికగా బోధపడింది. ఆంజనేయశాస్త్రి, శ్రీనివాస్ (వయొలిన్) వెంకట రామకృష్ణ (మృదంగం), వెంకటేశ్వరరావు (కీబోర్డ్), నాగప్రసాద్ (తబలా), అనిల్‌కుమార్ (ఘటం), లక్ష్మీశంకర్ (మోర్సింగ్), కుమార్‌బాబు (వేణువు) వాద్యసహకారంతో రక్తికట్టించారు. డాక్టర్ వి.సాంబిరెడ్డి, కె.రాజేశ్వరరావు, కామశాస్త్రి పర్యవేక్షించారు.

వస్త్ర దుకాణం ప్రారంభించిన సినీ హీరోయిన్ కేతికాశర్మ



చిలకలూరిపేట: సినీ హీరోయిన్ కేతికాశర్మ చిలకలూరిపేట పట్టణంలో సందడి చేశారు. పట్టణంలో నూతన ఏర్పాటు చేసిన సిరి డ్రెస్ డివైన్ షోరూమ్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. షోరూమ్‌ను ప్రారంభించి అభిమానులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో షోరూమ్ ఎండీ మాజేటి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీ కార్యవర్గం ఎన్నిక

పెదకూరపాడు: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నరసరావుపేటలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, అనుబంధ సంఘాల ఆధ్వర్యం మహాజన సోషలిస్టు పార్టీ కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కనుమూరి కోటేశ్వరరావు మాదిగ, ఉపాధ్యక్షుడుగా గడిపర్తి శ్రీనివాసరావు మాదిగ, కార్యదర్శిగా మాతంగి సత్యానందం మాదిగ, కోశాధికారిగా కంచర్ల జాన్ బాబు మాదిగ, పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడుగా వేమవరపు జీవన్ మాదిగలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు క్రీడా స్ఫూర్తి ముఖ్యం


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: క్రీడలలో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తి ముఖ్యమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ -2023 విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైన కూడా ఆసక్తి చూపాలన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటుగా ఆరోగ్యం కూడా సమకూరుతుందని చెప్పారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ కె.సురేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ పోటీలకు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పలు విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ బహూకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి విద్యార్థులతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు దంపతుల ఎంపిక


జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన శ్రీనివాసరావు, మాధవి దంపతులు

నరసరావుపేట ఈస్ట్: భార్యాభర్తలు, పైగా ప్రభుత్వ ఉద్యోగులు. తమ విధులను నిర్వహిస్తూనే ఆటలపై మక్కువతో అథ్లెటిక్స్ పోటీలలో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకొస్తున్నారు. పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పొగర్తి శ్రీనివాసరావు, నరసరావుపేట కస్తూరిబా గాంధీ పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న తెల్లమేకల మాధవి దంపతులు. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9, 10 తేదీలలో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. శ్రీనివాసరావు 50 సంవత్సరాలు పైబడిన విభాగంలో ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం, లాంగ్ జంప్, హైజంప్‌లో కాంస్య పతకాలు సాధించగా, మాధవి 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో 5కే వాక్‌లో స్వర్ణం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో 2024 ఫిబ్రవరిలో పూణెలో జరగనున్న పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడలలో రాణిస్తున్న శ్రీనివాసరావు, మాధవి దంపతులను పోలీస్, విద్యాశాఖ ఉద్యోగులు అభినందించారు.

ఉత్సాహంగా అంతర్‌కళాశాలల వాలీబాల్ టోర్నీ


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 25 జట్లు పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌తో కలసి వాలీబాల్ పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి శివాజీ, ఏఎన్‌యూ వాలీబాల్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ పాతూరి శ్రీనివాస్, డాక్టర్ ధనుంజయ్ పోటీలను ప్రారంభించారు. ఆదివారం జరిగిన పోటీల్లో ఆయా కళాశాలలకు చెందిన క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా తలపడ్డారు. ఏఎన్‌యూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టుపై నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు 2-0 సెట్స్‌తో విజయం సాధించింది. గుంటూరులోని జేకేసీ కళాశాలపై ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల 2-1, నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలపై ఆంధ్ర క్రైస్తవ కళాశాల 2-0, టీజేపీఎస్ కళాశాల జట్టుపై డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలపై 2-0 సెట్లతో హిందూ కళాశాల, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలపై నరసరావుపేటలోని సిద్ధార్థ కళాశాల 2-1, నరసరావుపేటలోని కేబీఆర్ కళాశాలపై బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 2-0, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలపై బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల 2-1, నరసరావుపేటలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలపై ముప్పాళ్ల ధనలక్ష్మి కళాశాల 2-1, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలపై కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల 1-2 సెట్లతో గెలుపొందాయి. కార్యక్రమంలో పోటీల సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఏఎన్‌యూ పూర్వ ఫిజికల్ డాక్టర్ వై.కిషోర్, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం మంటగలిసింది!

- ఆస్పత్రికి అని చెప్పి కన్నతండ్రిని రోడ్డుపై వదిలివెళ్లిన కొడుకు
- రోడ్డు పక్కన ఎటువంటి ఆచ్ఛాదన లేక చలికి నరకయాతన
- స్పందించి చేరదీసిన స్థానికురాలు


హైవే బ్రిడ్జి కింద ఉన్న వృద్ధుడు

గుంటూరు రూరల్: రెక్కలు ముక్కలు చేసుకుని, కష్టపడి పెంచిన కొడుకే ఆ తండ్రిని మాకొద్దు పొమ్మంటూ బయటకు గెంటేశారు. అనారోగ్యంతో ఉన్నావు కదా.. ఆస్పత్రికి తీసుకెళతానంటూ నమ్మబలికి దయాదాక్షిణ్యం లేకుండా నడిరోడ్డుపై చలిలో వదిలేసి వెళ్లాడో కర్కశ కుమారుడు. వివరాల్లోకి వెళితే.. అనారోగ్యంతో ఉన్న తండ్రికి వైద్యం చేయిస్తానని చెప్పి నమ్మబలికిన ఓ వ్యక్తి ఇంటి నుంచి ఆ వృద్ధుడిని తీసుకువచ్చి నగర శివారుల్లోని ఎన్‌హెచ్ 16 బైపాస్ లాలుపురం సమీపంలో జాతీయ రహదారి కల్వర్టు కింద (ఏఎస్ఆర్ కన్వెన్షన్ ఎదుట) వదిలిపెట్టి పోయాడు. నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధుడు తన పేరు కామిరెడ్డి వెంకటరెడ్డి అని, తన కుమారుడు తక్కెళ్లపాడు నుంచి ఆసుపత్రిలో చూపిస్తానని చెప్పి తీసుకువచ్చి ఇక్కడ వదిలి వెళ్లాడని చెబుతున్నాడు. ప్రస్తుతం అతని వద్ద రెండు దుప్పట్లు, ఒక లుంగీ మాత్రమే ఉంది. చలికి తట్టుకోలేని స్థితిలో ఉన్నాడు. తాను బాగా బతికిన కుటుంబానికి చెందిన వాడినని, కుటుంబ సభ్యులు మోసం చేసి ఇక్కడ వదిలిపెట్టి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పేరు మీద ఇంకా ఎకరం పొలం ఉందని చెబుతున్నాడు. ప్రస్తుతం ఎడమ కాలు విరిగిందని కన్నీటి పర్యంతం అవుతున్నాడు. తన కూతురు పిడుగురాళ్ల దగ్గర కోనంకి అనే ఊర్లో ఉన్నట్లు చెబుతున్నాడు. ప్రస్తుతం చలికి తట్టుకోలేకపోతున్నానని, ఏవరైనా ఆశ్రమ నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు చేరదీసి తన కుమార్తె వద్దకు, లేదా కుమారుడు వద్దకు చేర్చాలని వేడుకుంటున్నాడు. ప్రస్తుతం లాలుపురం గ్రామానికి చెందిన శిరీష అనే యువతి వృద్ధుని బాగోగులు చూసుకుంటోంది. వృద్ధుని వివరాలు తెలిసిన వారు అతని బంధువులకు సమాచారం అందించాలని, లేదా ఏదైనా ఆశ్రమానికి చెందిన వారైనా చేరదీయాలని ఆమె కోరింది.

కళ్లలో కారంకొట్టి వైఎస్సార్ సీపీ నేతలపై దాడి

గుంటూరు రూరల్: పొలం కౌలు విషయంలో వచ్చిన గొడవ నేపథ్యంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నేతల కళ్లలో కారం చల్లి దాడిచేసిన సంఘటన గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గారపాడులో పొలం కౌలు విషయంలో ఇరువురికి స్వల్ప వివాదం జరిగింది. ఇదే విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ వద్ద, పెద్దల వద్ద పరిష్కరించుకుందామని వారిలో ఒకరు చెప్పగా, టీడీపీకి చెందిన రౌడీషీటర్ పల్లపాటి వీరయ్య వీరనారాయణను, పెద్దలను దూషిస్తూ, స్థానిక మహిళలపై దాడిచేశాడు. విషయం తెలుసుకున్న వీరనారాయణ గారపాడులో గొడవపడ్డ వ్యక్తుల వద్దకు మాట్లాడేందుకు వెళ్లాడు. అప్పటికే ప్లాన్ ప్రకారం స్థానికంగా ఉన్న మహిళలు వీరనారాయణ, మరి కొంతమందిపై కళ్లలో కారం కొట్టి దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడినుంచి వీరనారాయణ, మిగిలిన వ్యక్తులు వెళ్లిపోయారు. విషయం ముందుగానే తెలుసుకున్న టీడీపీ నేతలు గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎవరొచ్చినా వారి అంతుచూస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. వీరనారాయణ గ్రామంలోని దళితులపట్ల సామరస్యంగా ఉంటూ వారికి చేదోడువాదోడుగా ఉంటున్నాడని, ఎలాగైనా అతని అంతుచూడాలని స్థానిక టీడీపీ నేతలు పన్నాగం పన్ని ముందుగా ప్లాన్ ప్రకారం గొడవను సృష్టించారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు.

ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం

చీరాల అర్బన్: పదో తరగతిలో ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్‌దెబోరా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీమేధావి కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. రాజ్‌దెబోరా మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదివే నిరుపేద విద్యార్థులు మంచి మార్కులే లక్ష్యంగా కృషి చేసి సత్ఫలితాలు పొందాలన్నారు. అలసత్వానికి తావు ఇవ్వకుండా చదవాలన్నారు. చదివిన అంశాలను ఒకసారి రాసి చూసుకుంటే గుర్తుండి పోతుందని సూచించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు సబ్జెక్టుల వారీగా విషయ నిపుణుల చేత సూచనలు, సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులకు అభ్యసన సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి సైదారెడ్డి, సబ్జెక్టు నిపుణులు పవని భానుచంద్రమూర్తి పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు..

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్
- ఘనంగా తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో 1997-98 పదోతరగతి విద్యార్థుల రజతోత్సవం


మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్

తాడికొండ: విద్య ద్వారానే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలు అధిరోహించి సమాజ మార్గ నిర్దేశకులుగా మారవచ్చని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్ అన్నారు. ఆదివారం తాడికొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో జరిగిన 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల రజతోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాను ఈ పాఠశాలలో చదువుకొని ఉన్నతంగా ఎదిగానని, నేటి విద్యార్థులు కూడా పోటీతత్వంతో చదువుకుని ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. పూర్వ విద్యార్థి, ఐఏఎస్ అధికారి కాంతీలాల్ దండే పాల్గొని అందరినీ ఆత్మీయంగా పలకరించి నాటి స్మృతులను నెమరవేసుకున్నారు. పాఠశాల అభివృద్ధిపై ఆరా తీసిన ఆయన ప్రహరీ నిర్మాణం, ఇతర వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు తమవంతుగా రూ.2 లక్షల విలువైన డైనింగ్ టేబుల్స్ అందజేయనున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రకటించారు. నాటి అధ్యాపకులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో అగ్ని ప్రమాదం

- సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన పెనుప్రమాదం


మంటలను అదుపుచేస్తున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి వున్న హెచ్‌పీసీఎల్ కంపెనీలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీకి చెందిన బోర్డులు, ఆ బోర్డులకు వచ్చిన పాత ఫ్లెక్సీలను తీసివేసి కంపెనీలో ఒక మూల పడవేస్తుంటారు. ఆ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ పడవేడంతో మంటలు చెలరేగాయని సిబ్బంది భావిస్తున్నారు. ఫ్లెక్సీలు తగలబడడంతో భారీగా మంటలు, పొగ ఏర్పడింది. కంపెనీ సిబ్బంది మంగళగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఎఫ్ఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ వద్దకు చేరుకునున్న అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఫ్లెక్సీలు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు తగలబడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆయిల్ బ్యారల్లు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది తెలియజేశారు. గతంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీలో వచ్చిన చెత్తా చెదారాన్ని గోడపక్కన పడవేయడంతో ఇంజిన్ ఆయిల్ ట్యాంకుల సమీపంలో భారీ అగ్నిప్రమాదం జరిగి, భారీ నష్టం జరిగింది. గత అనుభవాలను పట్టించుకోకుండా హెచ్‌పీసీఎల్ కంపెనీ వారు నిర్లక్ష్యంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫ్లెక్సీల వ్యర్థాలను కంపెనీలోనే ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి. పెనుప్రమాదం తప్పిందని హెచ్‌పీసీఎల్ సిబ్బంది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్బీకేలో పంటనష్ట రైతు వివరాల నమోదు


పొగాకును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

పర్చూరు (చినగంజాం): మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల పరిధిలో నమోదు చేస్తున్నట్లు బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, పోతుకట్ల గ్రామాల్లో తుఫాన్ వలన దెబ్బతిన్న పొగాకు, మిరప, మినుము, మొక్కజొన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. పర్చూరు మండలంలో పొగాకు 13000 ఎకరాలు, మొక్కజొన్న 700 ఎకరాలు, మినుము 125 ఎకరాలు, పెసర 120 ఎకరాలు, మిరప 2800 ఎకరాలు, వరి 600 ఎకరాల వరకు నష్టపోయినట్లు అంచనా వేశారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. వీరి వెంట మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన్‌రెడ్డి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.